
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబర్ 2022








మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

తుపాన్ హెచ్చరిక..!

జిల్లావ్యాపితంగా చలిగాలులు - అధికారులు అప్రమత్తం



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 15 కి.మీ. వేగంతో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతోందని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. బుధవారం సాయంత్రం నుంచి జిల్లా వ్యాపితంగా చలిగాలులు వీస్తున్నాయి. శ్రీలంకకి తూర్పున 500 కి.మీ. దూరాన, 630 కి.మీ. తూర్పు ఆగ్నేయం జాఫ్నాకు (శ్రీలంక), దూరాన 690కి.మీ కారైకాల్‌కు 770 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా చెన్నైకి సమీపంలో కేంద్రీకతమై ఉంది. ఈ తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ క్రమంగా బుధవారం సాయంత్రం లేదా గురువారం మధ్యాహ్నం తుపానుగా మారి నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు పుదుచ్చేరికి దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ తీరానికి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి ఆనుకుని ఉన్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు తదుపరి 48 గంటలు కొనసాగుతుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు నమోదు కావచ్చునని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నేడు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు చాలా చోట్ల కురిసే అవకాశముంది. భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు. ..ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని తెలిపారు. వాతావరణ హెచ్చరికలతో ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో ఉన్నప్పటికి కింద స్థాయి అధికారులు తుపాన్ జాగ్రత్తలు తీసుకున్నారు. నెల్లూరు, కావలి, గూడూరు, తదితర ప్రాంతాల్లో అధికారులు సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గంజాయి పట్టివేత

నలుగురు అరెస్టు

నెల్లూరు నగరంలోని కపాడిపాళెం ప్రాంతంలో గంజాయి విక్రయానికి ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో విభాగం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ముఠా సభ్యుల నుంచి 12 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్‌ఈబి నెల్లూరు-1 పోలీసు స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు మీడియాకు వెల్లడించారు. స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ నగరంలోని కపాడిపాళెం ప్రాంతంలో గంజాయి ప్యాకెట్ల రూపంలో విక్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని పక్కా సమాచారం అందడంతో ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. ఒక ఇంటిలో 12 కేజీల గంజాయిని విక్రయించేందుకు అనుకూలమైన ప్యాకెట్లను తయారు చేస్తున్న షేక్ సుభాని, షేక్ జమీర్, షేక్ షఫీ, అరవ కామాక్షి లను అదుపులోకి తీసుకున్నామన్నారు. భార్యాభర్తలైన షేక్ సుభాని, సిరాజ్‌లపై ఎస్‌ఈబి నెల్లూరు -1 పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించామన్నారు. షేక్ సుభానిపై మూడు కేసులు సిరాజ్‌పై నాలుగు కేసులున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయిందన్నారు. వీరికి గంజాయి ఎక్కడ నుంచి సరఫరా చేస్తున్నారన్నది తదుపరి విచారణలో తేలనున్నదన్నారు. ఈ నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభను కనపరిచిన నెల్లూరు -1 ఎస్‌ఈబి ఇన్స్‌పెక్టర్ కె.వి. కిషోర్, ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది, జెడి ఇంటలిజెన్స్ బృందం ఇన్స్‌పెక్టర్ ఆర్ .నరహరిరావు పలువురు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

గోదాముల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసు కునేందుకు వీలుగా జిల్లాకు మంజూరైన బహుళార్ధ సౌకర్యాల కేంద్రాల (గోడౌన్) నిర్మాణాలను 2023 ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బహుళార్ధ సౌకర్యాల కేంద్రాల నిర్మాణాలపై కలెక్టర్ చక్రధర్ బాబు, సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల నిర్మాణాల పురోగతి, నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లిం పులపై సమీక్షించారు. జిల్లాకు 48 గోదా ములు మంజూరైనాయని, ప్రస్తుతానికి 19 గోదాములకు సంబంధించి నిర్మాణ పనులు పూర్తికాగా, 6 గోదాముల నిర్మాణాలు ఫినిషింగ్ స్టేజ్ లోను, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 48 గోదాముల నిర్మాణాలను 2023 ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని, ఈ సీజన్లోనే వినియోగంలోకి తీసుకు రావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 3వ విడత మంజూరు కాబడిన 127 గోదాములకు సంబంధించి త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిసిఓ తిరుపాల్ రెడ్డి, నాబార్డ్ డిడిఎం రవి సింగ్, డిసిసి బ్యాంక్ సీఈవో శంకర బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు : మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై మహిళలకు అవగాహన కార్యక్రమం బుధవారం స్థానిక 11 వ వార్డు సచివాలయ పరిధిలో సిడిపిఒ అంజమ్మ అధ్వర్యంలో జరిగింది. అంజమ్మ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి వాటిని అరికట్టడంపై మహిళలకు అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో 14, 15 ప్రకారం మహిళలకు పురుషులతో సమానంగా ప్రాథమిక హక్కులు కల్పించబడ్డాయని ఆమె చెప్పారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపులు ఈ హక్కులను అరిస్తుంటే వాటిని అరి కట్ట డానికి చట్టం ఆవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ

వధూవరులకు సిఎం ఆశీర్వాదం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

సూళ్లూరుపేట ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం వచ్చారు.. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కనుపర్తిపాడు జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్లో దిగారు. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ ఉన్న వైసిపి నేతలను ఆయన పేరు పేరునా పలకరించారు. స్థానిక విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వివాహానికి హాజరైన వధూవరులను ఆశీర్వదించారు. ఎంఎల్ఎ సంజీవయ్య ఆయనకు సాదరస్వాగతం పలికారు. అక్కడ నుంచి మళ్లీ కనుపర్తిపాడు హైస్కూల్‌కు చేరుకొని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో రేణిగుంట బయల్దేరారు. ముఖ్య మంత్రితో పాటు రాష్ట్ర విద్యుత్, అటవీ, సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఉన్నారు. సిఎంకు స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ సిఎం నారాయణ స్వామి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి, నెల్లూరు జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గురుమూర్తి, మేయర్ పొట్లూరి స్రవంతి, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు, నెల్లూరు గ్రామీణ, వెంకటగిరి, ఉదయగిరి, కందుకూరు, కావలి ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్ర శేఖర్‌రెడ్డి, మానుగుంట మహీధర్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, ఎస్‌పి విజ యారావు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నెల్లూరు నగర కమిషనర్ హరిత, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్‌పర్సన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి సుందరవల్లి

యువ మహోత్సవాల

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రెండో అంతర్ కళాశాలల యువ మహోత్సవాలు -2022 డిసెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు యువ మహోత్సవాల పోస్టర్‌ను ఉపకులపతి సుందరవల్లి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్ కళాశాలల యువ మహోత్సవాలు యువతలో వున్న కళా నైపుణ్యతను, ప్రతిభను వెలికితీ యడానికి దోహదం చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి జనవరిలో తిరుపతిలో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం లో జరిగే 36వ సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ కు పంపిస్తామన్నారు. ప్రతి కళాశాల ప్రిన్సిపల్స్ ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి అంతర్ కళాశాలల యువ మహోత్సవాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి. రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ విశ్విద్యాలయం, కష్ణ చైతన్య విద్యాసంస్థలు సం యుక్తంగా ఈ యువ మహోత్సవాలను నిర్వహిస్తున్నాయనానరు. ప్రిన్సిపాల్ ఆచార్య విజయ అనంద కుమార్ బాబు ఆచార్య సుజా ఎస్ నాయర్, డా. టి వీరా రెడ్డి, డా. వెంకట్రాయ్నులు, డాక్టర్ కె సునీత, డాక్టర్ఉస్సేనయ్య, డాక్టర్ ఉదయ్ , బి. సుధారాణి పాల్గొన్నారు

9న వైకల్య నిర్ధారిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణముల పంపిణీ కోసం వైకల్య నిర్ధారిత వైద్యశిబిరం ఈ నెల 9న కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఇఒ కె రవికుమార్ తెలిపారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలను పరిశీలించి వీల్‌చైర్స్, ట్రైసైకిళ్ళు, హియరింగ్ ఎడ్స్ ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు నాన్‌భవిత కేంద్ర ఉపాధ్యాయులు కె సుజాత, ఇ శ్రీలక్ష్మిలను, సెల్‌నెంబరు 7675995760లో సంప్రదించాలని చెప్పారు.

అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరిగేలా దిశా నిర్ధేశం చేసుకోవాలని, ఆ లక్ష్యాల దిశగా చర్యలు ఉండాలని ఎంపిపి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి సూచించారు. వలేటివారి పాలెంలో జిపిడిపి ప్రణాళికపై బుధవారం జరిగిన శిక్షణలో వారు ప్రసం గించారు. ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్ మాట్లాడుతూ ఫ్రంట్‌లైన్ వర్కర్లందరూ వారి శాఖలకు సంబంధించిన వివరాలను సర్వేచేసి సంబంధిత పంచాయతి కార్యదర్శులకు సమా చారం తెలపాలన్నారు. సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ఆత్మకూరులో డిసెంబర్ నెల 11, 12, తేదీలలో జరిగే సీఐటీయు 11 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తోటపల్లి గూడూరు సిఐటియు మండల అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్. కె. మస్తానమ్మ, మారుబోయిన రాజా కోరారు. ఈ సందర్భంగా వారు తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ ర్యాలీ, అనంతరం బహిరంగసభ జరుగు తుందన్నారు. అలాగే 12 వ తేదీ ప్రతినిధుల సభ జరుగుతుందని వారు తెలిపారు. ఈ సభకు ప్రధాన వక్తగా మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ. గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గొంటారన్నారు. ర్యాలీలో అత్యధికంగా కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల వేగూరు వెంకయ్య, సిఐటియు ఆశా జిల్లా ట్రెజర్ మధుసూదనమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ముఖ్యమంత్రికి మహీధర్‌రెడ్డి స్వాగతం

ప్రజాశక్తి -కందుకూరు :ఎంఎల్‌ఎ మానుకుంట మహీధర్ రెడ్డి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్య మంత్రిని మహీధర్ రెడ్డిని మర్యాదపూ ర్వకంగా కలిసి ఆయనకు గులాబీ పువ్వు ఇచ్చి స్వాగతం పలికారు.



సిఎంకు స్వాగతం పలుకుతున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

'కిసాన్ క్రాఫ్ట్'లో కార్మికుల తొలగింపు అన్యాయం

సిఐటియు ఆధ్వర్యంలో నగరంలో నిరసన



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు

పొదలకూరు మండలం , ప్రభగిరి పట్నం ప్రాంతంలోని కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమలో అక్రమంగా తొలగించిన కార్మికులను యాజమాన్యం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో తొలగించిన కార్మికులతో కలిసి సిఐటియు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్మికులతో ప్రదర్శనగా డిప్యూటి కమీషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంకు చేరుకొని కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ నియమనిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమ యాజమాన్యం కార్మికులను విధుల నుంచి అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి నెలకు రూ. 9 వేలు వేతనంగా అందజేయడం దుర్మార్గమన్నారు. ప్రతి కార్మికుడికి రూ.18 వేలు కనీస వేతనంగా అందజేయాలన్నారు. జిల్లాలోని పలు పరిశ్రమలపై కార్మిక శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇటువంటి ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా కార్మిక శాఖ అధికారులు స్పందించి జిల్లాలోని అన్ని పరిశ్రమలను తనిఖీలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తున్న వారిపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశ్రమలో ఎనిమిది గంటల పనివిధానం అమలు కావడం లేదన్నారు. మౌళిక వసతులు అసలు లేవన్నారు. జిల్లా అధికారులు పరిశ్రమ యాజ మాన్యం పక్షాన నిలవకుండా కార్మికులు పక్షంలో నిలిచి న్యాయం చేయాలన్నారు. గత రెండు రోజుల నుంచి కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్నా యాజమాన్యం మెండిగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా సమయం మించిపోలేదని పరిశ్రమ యాజమాన్యం స్పందించి వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో సిఐటియు కార్మికులకు అండగా నిలిచి పోరాటం తీవ్రతరం చేస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, నాయకులు కె.పెంచలనర్సయ్య , పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల ఆందోళన

పొదలకూరు :మండలంలోని ప్రభగిరి పట్నం వద్దనున్న కిసాన్ క్రాఫ్ట్ కర్మాగారం కార్మికుల ఆందోళనలు రెండో రోజైన బుధవారంకొనసాగాయి. ఈ కర్మాగారంలో పని చేస్తున్న ఉమాశంకర్, శ్రీనాథ్‌నుకారణం లేకుండా యాజమాన్యం తొలగించింది. యాజమాన్యం చర్యలను నిరసిస్తూ బుధవారం కూడా కార్మికులు ఆందోళన చేశారు. కర్మాగారంలో లేబర్ చట్టాలు అమలు కావడం లేదని, కనీస వేతనాలు గురించి పట్టించుకోవడం లేదని కార్మికులు తెలిపారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతోపాటు కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు



కార్యకర్తను పరామర్శిస్తున్న ఇంటూరి

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి -కందుకూరు

ఉలవపాడు మండలం చాకిచెర్లకు చెందిన టిడిపి కార్యకర్త పున్నేపల్లి జయకష్ణపై రావూరు గ్రామానికి చెందిన వైసిపి నేతలు మంగళవారం దాడికి పాల్పడ్డారు. బేల్దారి పని నిమిత్తం జయకష్ణ సాలిపేట వెళ్లి ఆటోలో సొం తూరికి తిరిగి వస్తుండగా దాడి జరిగింది. తీవ్రంగా గాయపడ్డ జయకష్ణ కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కందుకూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి జయకష్ణను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకోసం ఆర్థిక సాయం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, నియోజవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, నాయకులు దువ్వూరి రమేష్, జడ రవీంద్ర, దారా శ్రీను, లింగాబత్తిన మాల్యాద్రి, అభిషేక్ పాల్, పి శివ, వీరమల్లు సురేష్, పున్నేపల్లి మోహన్ ఉన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం పనులు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా జరుగు తున్నాయి. ఈ నేపథ్యంలో అంకమ్మ తల్లి పాదాల చెంత ఉంచే సువర్ణ యంత్రానికి తుమ్మపూడి వెంకట సుబ్బారావు భార్య శ్యామల ఒక గ్రాము బంగారానికి గాను రూ. 5116 విరాళం అందజేశారు. ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి ,మాదాల మాల్యాద్రి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

నెల్లూరు:సేవ ద్వారానే మనిషికి నిజమైన తప్తి కలుగుతుందని ఎంఎల్‌సి సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి ఏ/సి కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ స్వచ్ఛంధ సేవకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పి.మన్యురేంద్ర శర్మ, కర్రె మల్లేశం, భగవాన్ రెడ్డి, నిమ్స్ శ్రీహరిరాజు, లక్ష్మీ సూర్య లత, ఎమ్.మధుసూధన్ రావు, మధుసూధన్, పిట్టల అంజయ్య, ఆలియా భాను లను సేవారత్న అవార్డుతో సత్కరించారు. డాక్టర్ సగిలి సుధా రాణి, ఎస్. రవిప్రకాష్ రావు, కపిలవాయి అశోక్ బాబు లను సాహిత్యరత్న అవార్డుతో సత్కరించారు. ఎమ్. రామచంద్ర రావు, ఆదూరి కళాధర్ రాజు, సోమ అంజిరెడ్డి, జాలిస్టార్ సాంబశివరావు, చిట్టి బాలనాగేశ్వర రావు లను కళారత్న అవార్డులు అందజేశారు. డాక్టర్ ఎస్.పి.భారతి సభాధ్యక్షులుగా వ్యవరించారు. తెలంగాణ పర్యాటక శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త, సర్వజన సేవా ట్రస్టు చైర్మన్ ఉన్నం సుబ్బారావు, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, ఎస్.రామచంద్ర రావు, పొదిలి కనకరత్నం, వై.చంద్రశేఖర్ రెడ్డి, భూపాలరావు, కళ్యాణ్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ మధుసూధనాచారి

వృద్ధురాలిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

ఆస్పత్రికి తరలించేందుకు నిరాకరించిన '108'

ప్రజాశక్తి -పొదలకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు సహాయం కోసం ఆర్తనాదాలు చేస్తుంటే..ఆమెను పట్టించుకునే వారే కరువయ్యారు. పట్ట ణంలోని రామ్‌నగర్ గేట్ సెంటర్‌లో జరిగిన సంఘటనే అందుకు ఉదాహరణ. ఆ సంఘటనను చూస్తే మానవత్వం మంట కలసింది అని చెప్పడంలో అతిశయోక్తి లేదనిపిస్తుంది. ఓ అనాథ వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆమెకు తీవ్రగాయాలై నిస్సహాయ స్థితిలో ఉండి పోయింది. ఎవరూ పట్టించుకోలేదు. స్థానికులు కొందరు రిక్షాలో ఆమెను ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. ఆమెకు వైద్యం చెయ్యడానికి ఆ ప్రయివేటు వైద్యులు నిరాకరించారు. దీంతో వారే 108 కు సమా చారం అందించారు. 108 సిబ్బంది వాహనం ఆమెను తీస ుకెళ్లె ందుకు నిరాక రిం చారు. ఆమెకు సంబం ధించిన వ్యక్తులు ఎవరైన ఉంటే తీసుకెళా ్తమని తెలిపారు. ఆమె అనాథ అని చెబుతున్న పట్టించుకోలేదు. దీంతో 108 సిబ్బంది తీరుపై పలు విమర్శలు వ్యక్తమవు తున్నాయి.ఈ విషయం తెలుసుకున్న పట్టణంలోని తొగటవీధికి చెందిన టిడిపి నాయకుడు మద్దిరెళ్ల ప్రసాద్ తన సొంత ఖర్చుతో ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందేలా చేవారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకత

ప్రజాశక్తి -పొదలకూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకిత ఉందనిమాజీ ఎంపి చింతామోహన్ పేర్కొన్నారు. భారత జూడో యాత్రలో భాగంగా ఆయన సర్వేపల్లి నియోజ కవర్గం లోని పొదల కూరులోని ఎసి కాలనీలో ఆయన పర్యటిం చారు. ఆయన మాట్లా డుతూ దళితుల ఆకలి తీర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుం దన్నారు. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసిందన్నారు. మహిళలకు పావలా వడ్డీ రుణాలను బ్యాంకుల ద్వారా అందజేసిం దన్నారు. మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుపేద, మధ్యతరగతి ప్రజలు సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



విజయవాడకు తరలిన బిసి నాయకులు



కందుకూరులో...

తోటపల్లిగూడూరు : బీసీ సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసీపీ కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలో జరిగిన బీసీ మహా సభకు శంకరయ్య గౌడ్ సారథ్యంలో తోటపల్లిగూడూరు మండలం నుంచి బీసీలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీసీల సంక్షేమమే సిఎం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. బీసీల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో కషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి చరిత్ర సష్టించారాని శంకరయ్య గౌడ్ కొనియాడారు. బీసీల సంక్షేమం కోసం కషి చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా వున్నారా అంటే అయన ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమే నన్నారు. వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం, అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కషిని శంకరయ్య కొనియాడారు. సీఎం జగన్ అన్ని రంగాలలో బీసీలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని అయన తెలిపారు. సీఎం కషితో బీసీల్లో గొప్ప మార్పు వచ్చిందని శంకరయ్య గౌడ్ అన్నారు. బీసీ మహా సభకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

ప్రజాశక్తి -కందుకూరు : వైసిపి ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన జయహో బిసి మహా సభకు కందుకూరు నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నుంచి బిసి ప్రతినిధులు భారీగా తరలి వెళ్లారు. ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 9 బస్సుల్లో బిసి ప్రతినిధులు తరలివెళ్లారు.



తోటపల్లి గూడూరు..

నాడు-నేడు పనులు పరిశీలన



ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని బసినేని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు 2వ విడత పనులను బుధవారం ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్, ఎంఇఒ మస్తాన్ వలీ పరిశీలించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్లాబు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులలో నిధులకి సంబంధించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. పనులు త్వరతగిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్ కుమార్, సిఆర్‌పి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఆటల పోటీలు



ప్రజాశక్తి-దగదర్తి : ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఆటల పాటలు బోసి గేమ్స్ పోటీలను దగదర్తిలోని జెసినాన్ భవిత సెంటర్‌లో బుధవారం ఎంఇఒ భాస్కర్ నిర్వహించారు. పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటి వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. సమగ్ర శిక్షణ నుండి పిల్లలు పొందుతున్న రాయితీలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. పోటీలో గెలుపొందిన పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి రవికుమార్, రమేష్, అశోక్, సుజాత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం



ప్రజాశక్తి-వింజమూరు : పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో కొంతమంది చిన్నారులు కొన్ని ప్రత్యేక కోసం బాధపడుతున్నారని తెలిపారు. వాటిని కూడా వైసిపి ప్రభుత్వం పట్టించుకొని ప్రతి పేదవాని సహాయం చేయాలని ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. జిల్లాలో దాదాపు 300 మందికి ప్రత్యేక అవసరం గల సైకిళ్ళు, ఇతర వస్తువులు సహాయం చేసినట్లు, అందులో భాగంగా వింజమూరులో ఉన్న పిల్లలకి కూడా సహాయం చేసేందుకు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యకి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలియజేశారు. ఇప్పటికే భవిత లాంటి శిక్షణ పాఠశాలలో ఉన్నాయని ప్రత్యేక లోపం ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ట్రైన్ అయినా టీచర్‌ను నియమించామన్నారు. ఆమె సహాయంతో అందరి అవసరాలు తీరుస్తున్నామని తెలిపారు. ఇటువంటి ప్రోగ్రాం ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంఇఒ మాలకొండారావు, వింజమూరు నాయకులు ఉన్నారు.

నాణ్యత లేని వస్తువులపై అలసత్వం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలో నిత్యం చిన్నపిల్లలు, పెద్దవాళ్లు తినే ఆహార పదార్థాల తయారీలో తయారీ తేదీని ముద్రించకుండా, గడువు అయిపోయినవి కూడా వ్యాపారస్తులు వాటిని ప్రజలకు విక్రయిస్తున్నారని ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, మండల అధ్యక్షులు చల్లగాలి వెంకట్ మోహన్, వైస్ ప్రెసిడెంట్ డి.మహేష్ పేర్కొన్నారు. వాటిని తిని ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా వారు తయారీ తేదీ, గడువు తేదీ లేని వాటిపై ఉక్కుపాదం మోపాలన్ని తెలియజేశారు.

'ల్యాండ్ పార్శిల్ మ్యాప్' పంపిణీ

ప్రజాశక్తి-దగదర్తి : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత హక్కు-భూపథకంలో భాగంగా రీసర్వేకు సంబంధించిన ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌లను బుధవారం తహశీల్దార్ శ్రీనివాసులు సచివాలయ సర్వేయర్లకు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత భాగంలో మారెళ్లపాడు, ఎలమంచిపాడు, కామినేనిపాలెం తదితర గ్రామాల్లో రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి బి ప్రవీణ్ కుమారి, దగదర్తి సర్వేయరు శివ, విలేజ్ సర్వేయర్లు బాలాజీ, అనీఫ్, కృష్ణతేజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పవనన్న ప్రజాబాట'



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయాలన్న దృఢ సంకల్పంతో, ప్రజల ఆశీర్వాదంతో కొనసాగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమం, బుధవారం 35వ రోజుకు చేరుకుంది. పవనన్న ప్రజాబాట కార్యక్రమం పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని జమ్మలపాలెం, వందూరుగుంట ప్రాంతాలలో పర్యటించి ప్రతి ఇంటికి జనసేన పార్టీ కరపత్రాలను పంచుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేశారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను తెలుసుకొని జనసేన పార్టీ తరపున తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వంశీ, చంద్ర, సురేంద్ర, భాను, పవన్, అనిల్, ఆనంద్, హరిబాబు, హజ్రత్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో రన్నర్స్‌గా 'శ్రీ సాయి'



ప్రజాశక్తి-కావలి : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో కావలి శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారని, వారిని అభినందిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌కిరణ్ తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం వారు సోమవారం నెల్లూరులో నిర్వహించిన కబడ్డీ పోటీలలో కావలి శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులు రన్నర్స్‌గా రాణించటం ఆనందంగా ఉందన్నారు. అలానే గత వారంలో ఆత్మకూరులో జరిగిన బాయ్స్ కబడ్డీ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. అటు చదువులో ఇటు ఆటలలో తమ కళాశాల విద్యార్థులు కావలి పట్టణంలోనే మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ సేవలో ఎంఎల్‌ఎ రామిరెడ్డి



ప్రజాశక్తి-అల్లూరు : మండల ప్రజల ఆరాధ్య దైవం అల్లూరు పోలేరమ్మ పల్లకి సేవలో మంగళవారం రాత్రి కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రధాన పూజారులు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కావలి ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భాజా భజంత్రీలు, బాణాసంచా పేల్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మండల వైసిపి ప్రధాన కార్యదర్శి సామంతుల సురేష్‌రెడ్డి, తదితరులున్నారు.

'గీతాంజలి' విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల ఫైనల్‌ఇయ ర్ ట్రిపుల్ ఐటి విద్యార్థి గట్టం నిఖిల్ గత నెల 20 నుంచి 29 వరకూ గుజరాత్ రాష్ట్రం ఆనంద్ జిల్లాలో సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రీరిపబ్లిక్ డే పెరేడ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్ కుమార్ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన తెలియజేశారు. ఈ విద్యార్థి కళాల ఎన్.ఎస్.ఎస్. విభాగానికి ప్రాతినిత్యం వహించాడు. ఈ విద్యార్థి ప్రీరిపబ్లిక్ డే పెరేడ్ కు ఎంపిక కావడం ద్వారా తమ కళాశాల గౌరవాన్ని ప్రతిష్టను మరింత ఇనుమడింపజేశాడని తెలిపారు. అనంతపూర్ జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలో తమ కళాశాల విద్యార్థి ఒక్కడే ఎంపిక కావడం తమకెంతో గర్వ కారణమన్నారు. కళాశాల సెక్రటరీ ఎన్.సుధాకర్ రెడ్డి, విభాగధిపతులు, అధ్యాపక బందం, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి వై.మురళీకష్ణను అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు తాలూకా ప్రాంగణంలోని పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒపిఆర్‌డి సరిత ప్రాంగణమంతా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం బయట ఉన్న తాగునీటి కుళాయి కొన్ని రోజులుగా లీక్ అవుతున్నా సిబ్బంది ఎవరు పట్టించుకోలేదు. దీంతో నీరు వృథాగా పోతున్నాయని తెలిపారు. పందులు తిరుగుతున్న వాటిని పట్టించుకోలేదని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో వస్తున్న వాళ్లందరూ చెత్త చెదారం అంతా పోలీస్ స్టేషన్ ఎదుట వేస్తున్నారని, పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏదేమైనా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలపై వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపడుతున్నామని కావలి డి ఎల్ డి ఓ కనకదుర్గ భవాని పేర్కొన్నారు. మండల ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లో తీసుకొని వెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు ఇస్తున్న నిధులు సంక్షేమ పథకాలు గురించి, మహిళలకు, చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తుందన్నారు. వాటిని ప్రజల్లో అవగాహన కలిగించేందుకు గ్రామ వాలంటీర్లకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వెంటనే అందించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలు అందించాలని ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ నాయకులు పి.శ్రీను, బి.బాలాజీ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయం నుండి విద్యార్థులు భారీ ర్యాలీతో తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శీను మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వక పోవడం అత్యంత శోచనీయమన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే తాను పెద్ద దిక్కునై పెద్దమామను అవుతానని చెప్పారనీ, తీరా చూస్తే చదువుకునేందుకు పాఠ్యపుస్తకాలు ఇచ్చే పరిస్థితులే లేవని దుయ్యబట్టారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అన్ని మండలాలలో ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలు త్వరగా ఇవ్వని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు విద్యార్థులందరూ తమకు రావాల్సిన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరెంట్ బిల్ ఎక్కువ వస్తే ఆ విద్యార్థికి అమ్మబడి రాదనీ, కారు ఉంటే రాదనీ, ఇలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు కాస్మాటిక్ ఛార్జీలు గతంలో ప్రతి విద్యార్థికి రూ.70 ఇచ్చేదనీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాస్మాటిక్ ఛార్జీలు ఎత్తివేసినట్లు తెలిపారు. అలాగే మెస్ ఛార్జీలు 4 సంవత్సరాల తర్వాత, పాత రేట్లను ఇస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాలు చేపడుతామన్నారు. ఈ అకడమిక్ పరీక్షలలో భాగంగా ఫిబ్రవరి ప్రాక్టికల్స్ మార్చిలో పబ్లిక్ పరీక్షలు జరుగుతుండగా ఇంతవరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ తరఫున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బి.రాజేష్, పి.అశ్విన్ తదితరులున్నారు.

మహాసభను జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి

11, 12 తేదీల్లో ఆత్మకూరులో జరిగే సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గడ్డం నాగేశ్వర రావు, సిపిఎం మండల కార్యదర్శి రైతు సంఘం నాయకులు పర్వీన్ బాషా, కాకు వెంకటయ్య కోరారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ తేదీన ఆత్మకూరులోని ఆర్‌టిసి డిపో నుండి మధ్యాహ్నం 2 గంటలకు ర్యాలీ జరుగుతుందని, 4 గంటలకు మున్సిపల్ బస్టాండ్ సెంటర్లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులుగా మాజీ ఎంఎల్‌ఎ గఫూర్ పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40 వేలకు పైగా సభ్యులు కలిగిన ఏకైక ట్రేడ్ యూనియన్ సిఐటియు అని ఐక్య ఉద్యమ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సారథిగా పోరాట రూపకర్తగా సిఐటియు అసంఘటిత కార్మికులకు అండగా పట్టణ కార్మికులు సంఘటిత చేస్తూ పరిశ్రమ ప్రాంతాల్లో కృషి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వ విధానాలపై సమరభేరి మోగిస్తున్నది సిఐటియు అని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బిసిలకు అలంకార పదవులు : టిడిపి

ప్రజాశక్తి-ఉదయగిరి

బిసిలకు అలంకారప్రాయ పదవులను కట్టబెట్టి తన సమాజ వర్గానికి అత్యున్నత పదవులు కల్పించి బిసిలకు ద్రోహం చేశారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం



మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

తహశీల్దార్ కార్యాలయంలో బలహీన వర్గాల సమస్యలు వారిపై జరిగే దాడులకు నిరసనంగా టిడిపిగా డిప్యూటీ తహశీల్దార్ ఫజిహాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెంచలబాబు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మూడున్నర సంవత్సరమైనా బలహీన వర్గాల అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయలేదని విమర్శించారు. అలంకార ప్రాయంగా 56 మందిని కార్పొరేషన్ చైర్మన్లను చేసి నేటికీ వారి కాల పరిమితి ముగిసిపోయిందని నాటికి వాటికి అమరావతిలో కార్యాలయాలయం కూర్చోవడానికి కుర్చీ లేకుండా చేశారని ధ్వజమెత్తారు. నిధులు విధులు లేని కార్పొరేషన్లు బలహీన వర్గాలకు ఇచ్చి రాజకీయంగా ఎదిగే వారిపై దాడులు నిర్వహిస్తూ మరోకపక్క బిసిల గౌరవ సభలు నిర్వహించడం ఏమిటని ఎద్దేవా చేశారు. నారా చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బలహీన వర్గాలకు చెందిన వారిని టిడిపి చైర్మన్‌గా నియమించి సముచిత న్యాయం చేశారన్నారు. మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, మండల బిసి నాయకులు నరసింహ రాజు, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, మండల మాజీ కన్వీనర్ బొజ్జ నరసింహులు, నాయకులు గానుగుపెంట ఓబుల్ రెడ్డి, ఎస్‌సిసెల్ నాయకులు నల్లిపోగు నరసింహులు, ఖాన్‌సా, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు చింతనబోయిన శివకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దారుకు గిరిజనుల వినతి

ప్రజాశక్తి-సీతారామపురం



గతంలో ప్రభుత్వం ద్వారా తమకు ఇచ్చిన భూమిని తమకే కేటాయించాలని మండలంలోని నాగరాజుపల్లి ఎస్‌టి కాలనీవాసులు బుధవారం తహశీల్దార్ షేక్.షాజియా బేగంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరాజుపల్లి గ్రామంలో 40 సంవత్సరాలుగా ఎస్‌టిలకు చెందిన సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, అయితే గతంలో 1991వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం తమ 50 కుటుంబాలకు ఇంటి స్థలాల కోసం సర్వేనెంబర్ 91-1లో సుమారు 6.2 ఎకరాలు భూమిని కేటాయించిందని తెలిపారు. అయితే అందులో నుండి 2 ఎకరాల భూమి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులలో ఉందన్నారు. ఈ విషయమై అధికారులు చొరవ చూపి తమకు కేటాయించిన సర్వే నెంబర్ల గల భూమితో పాటు 91-2లో ఉన్న ప్రభుత్వ భూమి కలిపి 7.82 సెంట్ల భూమిని తమ 50 కుటుంబాలకు సర్వే చేసి ఇళ్లస్థలాలు ఏర్పాటు చేసుకునేందుకు హద్దులు చూపించాలని కోరామన్నారు. అనంతరం తహశీల్దార్ షేక్.షాజియ బేగం మాట్లాడుతూ 91-1 సర్వే నెంబర్ గల 6 ఎకరాల భూమిలో 2 ఎకరాలు ప్రభుత్వం ఆధీనంలో ఉంచుకోవాలని హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొందని కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటామన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



ప్రజాశక్తి-అల్లూరు

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపిపి దర్శిగుంట శశిరేఖ వెల్లడించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జిపిడిపి తయారీపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ముందుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ధ్యాన కార్యక్రమాన్ని చేపట్టి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం ద్వారా బిపి, సుగర్ అనేక రుగ్మతల సమస్య తీరుతుందని తద్వారా ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని తెలిపారు. తదుపరి ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ అభివృద్ధి ప్రణాళికలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచులు అన్ని శాఖల అధికారులు బాధ్యతతో ఉండాలని కోరారు. జిపిడిపిని అభివృద్ధి పరచుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చెంచయ్య, ఎంఇఒ నాగేశ్వరరావు, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ, అప్లోడ్ విధానంపై బసినేనిపల్లి సచివాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ బుధవారం మండలంలోని పంచాయతీల ప్రజా ప్రతినిధులు, మండల అధికారులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బసినేనిపల్లి సర్పంచ్ పల్లె విజయమ్మ నూతన్, ఎంఇఒ మస్తాన్ వలీ, ఇఒపిఆర్‌డి భార్గవి, పిఆర్ ఎఇ శ్రీనివాసరాజు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ జగన్నాథం, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, ఎన్ఆర్ఇజిఎస్ ఇసి సువార్తయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ఎంతో దోహద పడుతాయని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నడూ లేనివిధంగా నిబంధనల మేరకు గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా తయారు చేయడం కోసం ఈ శిక్షణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి టి.ఉషారాణి, ట్రైనర్లు భాస్కర్, షేక్. షఫీ, కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్, అప్పారావుపాలెం, బట్టేపాడు, వాసిలి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని గ్రామాల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. మండల పరిధిలోని శకునాలపల్లి సచివాలయంలో మండల స్థాయి అధికారులతో సర్పంచ్ లక్కు రమణమ్మ అధ్యక్షతన శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పంచాయతీకి వచ్చే అన్ని రకాల వనరులను సమకూర్చుకొని ప్రణాళికా బద్ధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి అంచనాలను రూపొందించడానికి ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మౌలిక వసతులు, తదితర మౌలిక వసతులపై అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రాబోయే 2023 - 24 సంవత్సరాలకు అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి, గ్రామాలను అభివద్ధి బాటలో తీసుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శకునాలపల్లి, కృష్ణం పల్లి, నేలటూరు, జి చెరువు పల్లి, బండగానిపల్లి సర్పంచులు ఎంపిటిసిలు సచివాలయ సిబ్బంది ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ, ఎపిఎం ఖాజా రంతుల్లా, ఇఒపిఆర్‌డి మల్లికార్జున, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టి కృషి వల్లే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ భాస్కర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫ్రంట్ లైన్ వర్కర్లకు గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై మొదటిరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటగా గ్రామ స్వరాజ్యం కోసం కలలుగన్న గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పరిపాలనాధికారి శ్రీనివాసరావు పాడిన శ్లోకాలు, పంచాయతీల ఆవిర్భావంపై ఇచ్చిన విశ్లేషణాత్మక ప్రసంగం ఆలోచింపజేశాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై టిఒటిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఎపిఒ ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. శిక్షకులు ఇఒపిఆర్‌డి ప్రసాద్, శ్రీనివాస రావు, పంచాయతీ కార్యదర్శి ఎస్థా, ప్రతాప్, ప్రసాద్ రెడ్డి, మహమ్మద్ రఫీతో పాటు సర్పంచులు, కార్యదర్శులు, ఫ్రంట్ లైన్ వర్కర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి విక్రమ్‌రెడ్డి స్వాగతం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పూలబొకే ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ మేరకు సూళ్లూరు పేట ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహం సందర్భంగా నెల్లూరుకి విచ్చేసిన సిఎంను విక్రమ్‌రెడ్డి కలిశారు.



రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి

క్రైం కార్నర్

ప్రజాశక్తి-సీతారామపురం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం సీతారామపురం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి మేరకు.. స్థానిక ఎల్.వి. ఆర్ జూనియర్ కళాశాల సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని చర్లపల్లి వెంకటయ్య(60) అనే వ్యక్తి మృతి చెందాడు. సీతారామపురం పంచాయతీ ఏనుగుల వారి కొట్టాల గ్రామానికి చెందిన చర్లపల్లి వెంకటయ్య ద్విచక్ర వాహనంపై సీతారామపురానికి వస్తుండగా, సీతారామపురం హరిజనవాడకు చెందిన పిడతల వెంకటేష్ అనే వ్యక్తి సీతారామపురం నుండి సంగసానిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్న నేపథ్యంలో ఇరువురి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన 108 వాహనంలో సీతారామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి ఉదయగిరి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. చల్లపల్లి వెంకటయ్య చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుమారుడు గతంలో అదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం మళ్లీ ప్రస్తుతం తండ్రి అదే ప్రదేశంలో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అల్లుకున్నాయి.

'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని పెదిరెడ్డిపల్లి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం ఉదయగిరి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని రామా రావు నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి వచ్చిన ఆయనకు పెద్దిరెడ్డిపల్లి గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పెదిరెడ్డిపల్లి గ్రామంలోని జెడ్‌పి స్కూలు సెంటర్ నుండి పాత ఊరు ఎస్‌సి కాలనీ మీదుగా గ్రామం మొత్తం ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాల గురించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు గురించి తెలిపారు. ముఖ్యంగా ఈ కార్యక్రమానికి యువకులు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పెద్దిరెడ్డిపల్లిని పచ్చ జెండాలతో పసుపు మాయం చేశారు. మహిళలు బొల్లినేని రామారావుకి తిలకం దిద్ది హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి వీధిలోను ప్రతి ఇంటి దగ్గర అపూర్వ ఆదరాభిమానంతో బొల్లినేని రామారావుని స్వాగతించారు. ఈ సందర్భంగా బొల్లినేని రామారావు మాట్లాడుతూ ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో వచ్చిన అపూర్వ స్పందనే జగన్ ప్రభుత్వంపై ప్రజలకు ఎంతటి వ్యతిరేకత ఉందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలోని రైతులు మహిళలు వ్యాపారస్తులు పెట్టుబడిదారులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ప్రతి ఒక్కరూ ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనుకుంటున్నారని తెలిపారు. మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్, మాజీ మండల కన్వీనర్ వెంకయ్య, నాదెండ్లరాజా, మజ్జె లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు



ఆధ్వర్యంలో బుధవారం 26వ వార్డులో క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నవ రవిచంద్ర సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి వైసిఇప పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి పట్టిన ఖర్మ పోవాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని మాలేపాటి పిలుపునిచ్చారు. వార్డులో ముఖ్యంగా ఉన్న పందుల బెడద సమస్యపై తీవ్రంగా ధ్వజమెత్తారు. వెంటనే మున్సిపల్ అధికారులు వీటిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు స్థాయి నాయకులందరూ పాల్గొన్నారు.

రత్నం స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-కావలి :



విద్యార్థుల్లో చిన్న తనం నుంచే క్రీడల పై ఆసక్తి కలిగించడం వల్ల వారిలోని క్రీడా నైపుణ్యాలు వెలుగు లోకి వస్తాయని డాక్టర్ కిషోర్ రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కావలిలోని డాక్టర్ కిశోర్ రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విద్యార్థులకు క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసంతోపాటు చదువులో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. తమ స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ కె.కృష్ణ కిషోర్, శ్రీమతి వాసంతి కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లో ప్రోత్స హించేందుకు ప్రతి ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంఎల్ ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 7వ తేదీ నుండి తుఫాను హెచ్చరికలు ఉన్నందున మండల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలో తుఫాను కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా మండలంలో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండేటట్లు అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అధికారులకు అందుతున్న వినతులు, సర్వే ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి



పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మండలాల వారీగా అధికారులకు గడప గడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశాల ద్వారా అధికారులు స్వీకరించిన వినతులు, పరిష్కారించిన సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

'శ్రీ దత్త' జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కావలి : శ్రీ దత్త జయంతి సందర్భంగా బుధవారం ఉదయం కావలి పాతవూరులోని శంకర మఠంలో "శ్రీ దత్తాత్రేయ స్వామి"కి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. తదుపరి కావలికి చెందిన టంగుటూరి జయశ్రీచే "దత్తచరిత్ర" ప్రవచనం జరిగింది. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షులు కసవరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు టంగుటూరి ప్రకాష్ రావు, బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు పి.వి.ఎస్.ప్రసాద్, పురోహితులు రామచంద్రరావు, మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.